సాక్షి
జగిత్యాల
బుధవారం । 5 । జూలై । 2023



ఎల్లమ్మకు మొక్కులు

ధర్మపురి : రాజారంలోని ఎల్లమ్మ దేవాలయంలో ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



నీటిలో ముంచి.. ఊపిరి తీసి

కోరుట్ల: తన భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త వరదకాలువ నీటిలో ముంచి ఆమె ఊపిరి తీశాడు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీలోకి కాళేశ్వరం నీళ్లు



వరదకాలువలోకి చేరుతున్న నీళ్లు

మల్యాల(చొప్పదండి): కాళేశ్వరం నీటిని ఎస్సారెస్పీకి తరలిస్తున్నారు. ఈమేరకు మంగళవారం నుంచి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్ నుంచి నాలుగు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కులను వరదకాలువలోకి ఎత్తిపోస్తున్నారు. అవి జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌస్‌లోకి చేరుతున్నాయి. అక్కడినుంచి 5,800 క్యూసెక్కులను వరదకాలువలోకి ఎత్తిపోస్తున్నారు. ఇందుకోసం రాంపూర్ పంప్‌హౌస్‌లో నాలుగు మోటార్లను అధికారులు మంగళవారం ప్రారంభించారు. మిగిలిన నీటిని గాయత్రి, రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్‌ల మధ్య చెరువులను నింపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాగా, వరదకాలువ ద్వారా రివర్స్ పంపింగ్‌తో ఎస్సారెస్పీలోకి నీటిని తరలిస్తుండడంతో మధ్యలోని చెరువులు నింపే అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఏర్పడిన వర్షాభావాన్ని అధిగమించి, పంటలకు నీళ్లు అందుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



దిశానిర్దేశం చేస్తున్న బల్బీర్‌సింగ్

ధర్మపురి: రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి గ్రామాల్లో బీజేపీని మరింత బలోపేతం చేయాలని మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి సర్దార్ బల్బీర్‌సింగ్ కోరారు. స్థానిక ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ముఖ్య కార్యకర్తలతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాజ్ యోజన ద్వారా 3 కోట్ల మంది పేదలకు పక్కాఇళ్లు, 11.8 కోట్ల నివాసాలకు నల్లానీరు, 43.3 కోట్ల మందికి జన్‌ధన్ ఖాతాలు తెరిచిందన్నారు. ఇలాంటి పథకాలను ఇంటింటికి చేరవేయాలని సూచించారు. నాయకులు సంగెపు గంగారాం, బెజ్జారపు లవన్‌కుమార్, ఓరుగంటి చంద్రశేఖర్, బండారు లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, స్తంభంకాడి శ్యామ్, దివిటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విడిభాగాలకు వేలం

జగిత్యాలక్రైం: వివిధ సందర్భాల్లో పోలీసులు పట్టుకున్న ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల విడిభాగాలకు బుధవారం ఉదయం 10గంటలకు వేలం వేస్తామని ఎస్పీ భాస్కర్ మంగళవారం తెలిపారు. ఇందులో అన్‌సర్వీస్‌డ్ బ్యాటరీలు, పనిచేయని స్పేర్‌పార్ట్స్, జీవితకాలం ముగిసిన టైర్లను వేలం వేస్తామన్నారు. ఆసక్తిగలవారు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగే వేలం పాటకు హాజరు కావాలన్నారు. వివరాలకు 82478 70840 నంబరులో సంప్రదించాలని ఎస్పీ భాస్కర్ సూచించారు.

ఉద్యోగులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న డీఎం ప్రసూనలక్ష్మి

కోరుట్ల: స్థానిక ఆర్టీసీ ఉద్యోగులు ప్రగతిచక్రం వార్షిక పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్ ఆర్టీసీ కళాభవన్‌లో ఆ సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు పురస్కారాలు అందజేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి, కంట్రోలర్ శేఖర్, డ్రైవర్లు తిరుపతి, వేణు, కండక్టర్లు ఎస్ఆర్ రావు, బీఆర్‌జీరామ్ ప్రగతిచక్రం వార్షిక పురస్కారాలు అందుకున్నారు.

జగిత్యాలలో..

జగిత్యాలటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్లు కేఎస్ రెడ్డి, ఎస్టీరెడ్డి, కండక్టర్లు వి.పురుషోత్తం, ఎండీ అలీ, సెఫ్టీ వార్డెన్ సదానందం పురస్కారాలు అందుకున్నారని డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలిపారు.

ఎమ్మెల్సీ రమణకు పితృవియోగం



ఎల్బీరామ్ (ఫైల్)

జగిత్యాలరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎలగందుల రమణ తండ్రి ఎల్బీరామ్ (80) సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయన కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతికి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

సంతోషంగా ఉంది



ఎకరం పది గుంటలకు ప్రభుత్వం నాకు పట్టా ఇచ్చింది. ఇప్పటివరకు సాగులో ఉన్నా.. పెట్టుబడి సాయం అందలే. ఇప్పుడు రైతుబంధు సాయం అందుతుందని చెప్తున్నరు. చాలా సంతోషంగా ఉంది.

– ఉరివిత జంగు, చిత్రవేణిగూడెం

చాలాఏళ్లకు వచ్చినయి



దివంగత సీఎం వైఎస్సార్ 2008లో మా వాళ్లకు పట్టాలు ఇచ్చిండ్రు. అప్పటి జాబితాలో మా పేర్లు తప్పిపోయినయి. అప్పటినుంచి పట్టాల కోసం ఎదురుచూస్తూ ఉన్నం. ఇప్పుడు పట్టాలు వచ్చినయి.

– మందాటి రాంబాబు, మంగేళ

రావనుకున్నం



చాలా ఎళ్లయితంది కదా.. మాకు పట్టాలు వస్తయో.. రావో అనుకున్నం, ఇప్పుడు పట్టాలు వచ్చినయి. మా కుటుంబం పేరిట 1.20 ఎకరాలకు పట్టాలు ఇచ్చిండ్రు. ఇగ పండుగ చేసుకుంటం.

– తొడుసం బక్కు, చిత్రవేణిగూడెం

'పోడు' సంబురం

- 15మంది గిరిజనులకు హక్కుపత్రాలు
- 19.22.ఎకరాలు పంపిణీ చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్, అధికారులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- దివంగత సీఎం వైఎస్సార్‌ను గుర్తుచేసుకున్న అడవిబిడ్డలు



గిరిజన మహిళకు పట్టా అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన కలెక్టర్ యాస్మిన్ బాషా, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు

సారంగాపూర్(జగిత్యాల): అనేక ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. గిరిజనుల్లో ఆనందం వెల్లివిరిసింది. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న అటవీ భూములపై హక్కుపత్రాలు అందజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అడవిబిడ్డలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 15 మందికి 19.22 ఎకరాల అటవీ భూములపై గిరిజనాభివృద్ధి శాఖ మంగళవారం పట్టాలు పంపిణీ చేసింది. బీర్‌పూర్ మండలం మంగేళ, చిత్రవేణిగూడెం, తాళ్లధర్మారం గ్రామాల్లోని అత్యధిక మంది పేద గిరిజనులకు వీటి ద్వారా లబ్ధి చేకూరింది. వీరిపై అటవీశాఖ పరిధిలో కేసులు లేవని, సాగులో ఉన్నవారికే పట్టాలు పంపిణీ చేశామని అధికారులు వెల్లడించారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద పట్టాలు..

- 2005లో ప్రవేశపెట్టిన అటవీహక్కుల చట్టం(ఫారెస్ట్ రైట్స్ యాక్ట్.. ఆర్‌వోఎఫ్‌ఆర్) ద్వారా అటవీ భూముల్లో సాగుచేసుకుంటున్న గిరిజనులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలు జారీచేయాలని అప్పటి ప్రభుత్వం సంకల్పించింది.
- అడవులను ఆనుకుని నివాసం ఉండడం, బంక, పండ్లు, తేనె తదితర అటవీ ఉత్పత్తులు సేకరిస్తూ అడవులే జీవనాధారంగా బతికేవారిని అర్హులుగా ప్రకటించింది.
- వీరిలో 13 డిసెంబర్, 2005 కంటే ముందు నుంచి అటవీ భూముల్లో సాగు చేస్తున్న వారికే పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది.
- ఇందుకోసం రెండేళ్ల క్రితం గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది.

దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008లో గిరిజనులకు వేలాది ఎకరాలపై హక్కుపత్రాలు అందజేశారు. ఇందులో సారంగాపూర్ మండలం రేచపల్లిలో 320 ఎకరాలు, బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం, మంగేళ, చిత్రవేణిగూడెం తదితర గ్రామాల్లో అటవీహక్కుల చట్టం కింద 670 ఎకరాల అటవీ భూములకు పట్టాలు అందజేశారు.

సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ..

- తెలంగాణ ప్రభుత్వం కూడా పోడుభూములపై గిరిజనులకు పట్టాలు ఇస్తామని చెబుతూ వచ్చింది.
- ఆ మేరకు మంగళవారం పట్టాలు పంపిణీ చేసింది. వీరిసంఖ్య తక్కువగానే ఉన్నా.. అటవీశాఖ అధికారులతో ఇకనుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవనే భరోసా ఏర్పడింది.
- స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకోవడానికి మార్గం సుగమమైంది.
- అంతేకాదు.. ఈ పట్టాలు పొందిన వారికి రైతుబంధు పెట్టుబడి సాయం కూడా అందుతుందని అధికారులు తెలిపారు.

గిరిజన రైతులకు అండ

జగిత్యాల: గిరిజనులకు పోడు భూముల హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ఇది నిరంతర ప్రక్రియ అని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లాలో అర్హులైన 15 మంది గిరిజనులకు 19.22 ఎకరాలపై మంగళవారం పట్టాదారు పాస్‌పుస్తకాలను జిల్లా కేంద్రంలో అందజేశారు. మంత్రి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ గిరిజన రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, కలెక్టర్ యాస్మిన్ బాషా, జిల్లా అటవీ అధికారి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అప్పుడు వైఎస్సార్..



2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ మాలాంటి పేద గిరిజనులకు పట్టాలు ఇచ్చిండ్రు. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ మా కుటుంబానికి 1.20 ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిండ్రు.

– సిడం బిలాజీరావు, చిత్రవేణిగూడెం

నిర్భయంగా ఎవుసం చేస్తం



ఇన్నిరోజులు ఎవుసం చేసుకున్నా.. పట్టాలు లేవనే సాకుతో కొందరు జంగిల్‌సార్లు.. ఇబ్బంది పెట్టేవారు. ఇప్పుడు పట్టాలు వచ్చినయి. ఇక రంది లేకుండా నిర్భయంగా ఎవుసం చేసుకోవచ్చు. – కొంరం గణేశ్, చిత్రవేణిగూడెం

పత్తి పండించుకుంటం



మాకు ఇచ్చిన 1.20 ఎకరాల భూమిలో పత్తి పంట పండించుకుంటం. ఇప్పటి వరకు పెట్టుబడి సాయం అందలే.. ఇప్పుడు రైతుబంధు వస్తదని చెబుతున్నరు. పంట పెట్టుబడికి ఇక ఢోకాలేదు.

– ఆత్రం శ్యాంబాయి, చిత్రవేణిగూడెం

అప్పులు ఇవ్వాలె



ప్రభుత్వం మాకు ఇచ్చిన అటవీ భూములపై బ్యాంకులు అప్పులు ఇవ్వాలె. ఎవుసాన్ని ప్రోత్సహించాలె. పైసలు వస్తే.. బావులు, మోటార్లు, కరెంటు, పైప్‌లైన్లు వేసుకోవచ్చు. అప్పుల బాధ ఉండదు.

– చిడం బక్కు, చిత్రవేణిగూడెం

1 బీ రాలేదు..



ఆన్‌లైన్‌లో భూమి పట్టాలు నమోదు కాలేదనే కారణంతో 1 బీ రాలేదు. దీంతో ఆర్‌వో ఎఫ్‌ఆర్ పట్టాలపై బ్యాంకులు అప్పులు ఇవ్వలే. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలె. అప్పులు ఇచ్చేలా చూడాలె. రైతుబంధు అమలు చేయాలె. ఎలాంటి షరతులు పెట్టవద్దు.

– చిత్రం మారుతి, ఆదివాసీల నేత

మాకూ ఇవ్వండి



కథలాపూర్‌లోని ప్రధాన రహదారిపై బైఠాయించిన తొమ్మిది తండాల గిరిజనులు

కథలాపూర్(వేములవాడ): తాము ఏళ్లుగా సాగుచేసుకుంటున్న పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో గిరిజనులు మంగళవారం ధర్నా చేశారు. కథలాపూర్ మండలంలోని 9 గిరిజన తండాలకు చెందిన గిరిజనులు భారీసంఖ్యలో తరలివచ్చి కథలాపూర్ బస్టాండ్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు పట్టాలు ఇవ్వకపోవడం దారుణమని గిరిజనులు మండిపడ్డారు. రాష్ట్రంలో అర్హులైన గిరిజనులకు పట్టాలు ఇచ్చి.. జగిత్యాల జిల్లా గిరిజనులపై నిబంధనల పేరిట అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై కిరణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిరసన విరమించాలని ఆందోళనకారులను సముదాయించినా పట్టించుకోలేదు. ఆర్డీవో వచ్చి సమాధానం చెబితేనే ధర్నాను విరమింపజేస్తామని గిరిజనులు నినదించారు. ఎట్టకేలకు కథలాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడకు చేరుకుని గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గుగ్లోత్ రవినాయక్, ప్రతినిధులు సీతారామ్ నాయక్, రవీందర్‌నాయక్, భుక్యా తిరుపతినాయక్, విఠల్‌నాయక్, రమేశ్, అంజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి





నివాళి అర్పిస్తున్న జీవన్‌రెడ్డి, భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తెలంగాణ తొలిఅమరుడు దొడ్డి కొమురయ్యకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శణీయమన్నారు. కాగా, ఒకటో వార్డులోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి ఎమ్మెల్యే సంజయ్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ నరేశ్, డీఈ రాజేశ్వర్, కౌన్సిలర్లు కూసరి అనిల్‌కుమార్, కూతురు రాజేశ్, పంబాల రాంకుమార్, కోరె గంగమల్లు, పిట్ట ధర్మరాజు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలోనూ దొడ్డి కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి(కోరుట్ల): కురుమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎంపీపీ మారు సాయిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, సంఘం అధ్యక్షుడు కోట రమేశ్ పాల్గొన్నారు.

గుడుంబా నియంత్రణకు చర్యలు



ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లాలో గుడుంబా నియంత్రణకు పోలీసు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా కార్యాచరణతో ముందుకు సాగాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం పోలీసు, ఎక్సైజ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎస్పీ మాట్లాడారు. గుడుంబా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. గుడుంబా తయారీ, రవాణా, విక్రయదారులను పట్టుకుని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని సూచించారు. బెల్లం, పటిక తదితర ముడిసరుకుల విక్రయాలను పూర్తిస్థాయిలో నియంత్రించాలని ఆదేశించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, రాజశేఖర్‌రాజు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ చంద్రబాబు నాయక్, సీఐ ప్రభాకర్‌రెడ్డి, పోలీసులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో శ్రీధర్
- ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం

జగిత్యాల: గర్భస్థ సమయంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడానికి గర్భిణులకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ సూచించారు. గర్భిణుల్లో ప్రమాదకర గర్భస్థ లక్షణాలను త్వరగా గుర్తించి అనుసరించాల్సిన విధానంపై మంగళవారం మహిళా ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆర్మాన్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో స్థానిక ఎస్వీఎల్ఆర్ గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, అధిక ప్రమాద గర్భధారణ, లక్షణాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నా.. ప్రమాదకరమైన వ్యాధి తీవ్రత, సమస్యలు గుర్తించలేకపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివస్తున్న విద్యార్థినులు

జగిత్యాలటౌన్: విద్యార్థులు, యువత ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో వారికి నిరాశే మిగిలిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు రాపాక సాయికుమార్ అన్నారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆందోళన చేపట్టారు. రాష్ట్రం వ్యాప్తంగా రూ.5,300కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయని రాపాక సాయికుమార్ అన్నారు. నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలలు పేద విద్యార్థులను జలగల్లా పీడిస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. విద్యారంగ సమస్యల కోసం విద్యార్థి పరిషత్ ఉద్యమాలు చేస్తుంటే అధికార పార్టీ నాయకులు ఇతర రాష్ట్రాలతో పోల్చడం బాధాకరమన్నారు. జిల్లా విస్తారక్ నల్ల నవీన్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు కార్తీక్, సునీల్, రాజు, నగర కార్యదర్శి నందు, హాస్టల్ల కన్వీనర్ శ్రీనివాస్, రక్షిత, మహాలక్ష్మి, వైష్ణవి పాల్గొన్నారు.

కొంచెం మోదం.. ఎంతో ఖేదం..!

- పార్టీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ది తిరుగులేని ముద్ర
- పాదయాత్రలు, అరెస్టులతో జాతీయస్థాయిలో చర్చ
- బండిని తప్పించడంపై జిల్లా నేతల అసంతృప్తి
- త్వరలో కేంద్ర కేబినెట్‌లోకి ఎంపీ బండి సంజయ్?
- చేరికల కమిటీ చైర్మన్‌గా ఇంతకాలం ఈటల కినుక
- చివరికి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదోన్నతి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి విషయంలో పార్టీలో కొంతకాలంగా సాగుతున్న ప్రతిష్టంభనకు ఎట్టకేలకు తెరపడింది. కరీంనగర్ ఎంపీగా పార్టీ అధ్యక్షుడిగా ఇంతకాలం బీజేపీకి తిరుగులేని విజయాలు అందించిన బండి సంజయ్ స్థానంలో కిషన్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీచేసింది. జిల్లా నుంచి పెద్దలీడర్‌ను కీలక బాధ్యతల నుంచి తప్పించినా.. మరో కీలక పదవి కూడా ఇదే జిల్లాకు చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను వరించింది. ఇంతకాలం చేరికల కమిటీ చైర్మన్‌గా ఉన్న ఈటలను రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా పదోన్నతి కల్పించింది. బండిని తప్పించడం, ఈటలకు పదోన్నతి కల్పించడం వంటి పరిణామాలతో పార్టీ, ×బండి× వర్గంలో తీవ్ర నిస్తేజం నెలకొనగా.. ఈటల వర్గంలో కొత్త ఉత్సాహం మొదలైంది. మొత్తానికి పార్టీలో జిల్లా నేతలకు పదవులు మారినా.. అధిష్టానం వద్ద పట్టునిలుపుకోవడంలో కరీంనగర్ నాయకులు మరోసారి సత్తా చాటుకున్నట్లయింది.

ఫలించిన ఈటల మంత్రాంగం

జిల్లాలో సీనియర్ మంత్రిగా, ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌ది సుదీర్ఘ రాజకీయ అనుభవం. టీఆర్ఎస్‌లో చేరి అనతికాలంలో కేసీఆర్‌కు కుడిభుజంలా మారారు. తెలంగాణ ఉద్యమంలో ఈటల రాజేందర్ పాత్ర ప్రజలందరికీ తెలిసిందే. 2004లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేగా తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఈటల రాజేందర్ ఆపై వెనుదిరిగి చూసుకోలేదు. 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021లో రాష్ట్రంలో మొత్తం ఏడుసార్లు అసెంబ్లీకి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యేగా ఈటల రాజేందర్‌ది తిరుగులేని రికార్డు. ఇందులో 2008, 2009, 2010లో ఏడాదికి ఒకసారి చొప్పున అసెంబ్లీకి గెలుస్తూ హ్యాట్రిక్ సాధించారు. 2021లో మరో ఉప ఎన్నికలో విజయం సాధించి అత్యధిక ఉప ఎన్నికలు గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సొంతంచేసుకున్నారు.

- 2021లో అనూహ్య పరిస్థితుల మధ్య టీఆర్ఎస్‌ను వీడిన రాజేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలో బీజేపీ నుంచి విజయం సాధించారు. బీజేపీలో చేరికల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. వాస్తవానికి రాజేందర్‌ను పార్టీ అధ్యక్ష పదవి వరిస్తుందనుకున్నా.. జరగలేదు. ఈ క్రమంలో ఆయన అధిష్టానంపై ఒత్తిడి ప్రారంభించారు. బండికి వ్యతిరేకంగా సీనియర్లను కూడగట్టేందుకు యత్నించారు. ఒకదశలో పార్టీని వీడుతారని ప్రచారం జరిగింది. మొత్తానికి రాజేందర్ వ్యూహం ఫలించింది. పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమించడంతో ఈటల వర్గీయుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బండిని తప్పించడంపై నిరాశ

బీజేపీకి కొత్త ఊపు తీసుకువచ్చిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఒక సంచలనం. సంఘ పరివార్ నేపథ్యమున్న బండి 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా అనూహ్య విజయం సాధించారు. 2020లో రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టిన బండి సంజయ్ పార్టీకి కొత్త జోష్ నింపారు. రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో తొలి ఉపఎన్నిక దుబ్బాకలో బండి సంజయ్ నేతృత్వంలో పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా విజయం సాధించి రికార్డు సృష్టించింది. అనంతరం బండి తన దూకుడును జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అదేస్థాయిలో కొనసాగించారు. ఏకంగా 46 కార్పొరేటర్ స్థానాల్లో కాషాయజెండా ఎగరేసి అధికార పార్టీకి చెమటలు పట్టించారు. 2021 హుజూరాబాద్ ఎన్నికలోనూ ఈటల రాజేందర్ గెలుపుతో బండి గ్రాఫ్ మరింత పెరిగింది. 2022 జనవరి 317 జీవోకి వ్యతిరేకంగా బండి చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడం జాతీయస్థాయిలో చర్చ జరిగింది. ఇటీవల పదో తరగతి పేపర్ లీకేజీలు, భైంసా సభ సమయంలోనూ బండిని పోలీసులు అరెస్టు చేయడం రాష్ట్రవ్యాప్తంగా కేడర్‌ను ఏకంచేశాయి. 2022 మునుగోడు ఉపఎన్నికల్లోనూ బీజేపీ చివరి వరకు పోరాడింది. ప్రజాసంగ్రామ యాత్రలతో కేవలం తన పార్లమెంటు సెగ్మెంటులోనే కాకుండా.. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించారు. అప్పటిదాకా 10 శాతంగా ఉన్న బీజేపీ ఓటు షేర్‌ను 34.5 శాతానికి పెంచారు.

త్వరలో కేంద్ర కేబినెట్‌లోకి

అదే సమయంలో బండి జిల్లాలో సీనియర్లను కలుపుకొనిపోవడంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్‌లో ఫ్లోర్ లీడర్‌ని నేటికీ నియమించకపోవడంపైనా పలు ఆరోపణలు ఉన్నాయి. అదే సమయంలో పార్టీలో నగర అధ్యక్షుడిని నియమించకుండా ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్, సెంట్రల్ అంటూ జోన్లు విభజించి ఎవరికీ పట్టు దక్కనీయలేదని విమర్శలు ఎదుర్కొంటున్నారు. అదే సమయంలో బండి నిర్ణయాలను సమర్థించే ఫాలోవర్లకు కొదవలేదు. బండిని అధ్యక్ష పదవి నుంచి తప్పించడాన్ని వ్యతిరేకిస్తూ.. సోషల్ మీడియా హోరెత్తి పోతోంది. నగర పశ్చిమ డివిజన్ కార్యవర్గం రాజీనామా చేయడం గమనార్హం. రెండు మూడురోజుల్లో బండి సంజయ్‌ని కీలక పదవి వరించనుందని సమాచారం. కేంద్ర కేబినెట్‌లో బండికి చోటుదక్కనుందని పార్టీ వర్గాల సమాచారం.

క్లుప్తంగా

పసిబిడ్డను అమ్మిన తండ్రిపై కేసు

• పాపను తల్లి వద్దకు చేర్చిన పోలీసులు


పాపను తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

వెల్గటూర్(ధర్మపురి): డబ్బుకు ఆశపడి పసిపాపను అమ్మేయగా, ఇదేమిటని అడిగినందుకు ఆ చిన్నారి అమ్మమ్మ, తాతయ్యలపై విచక్షణారహితంగా దాడి చేసిన ఓ తండ్రిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాల ప్రకారం.. ఎండపల్లి మండలంలోని గుల్లకోటకు చెందిన జంగిలి జ్యోతి–లక్ష్మణ్ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు కాగా మూడో కాన్పులోనూ పాపే పుట్టింది. దీంతో డబ్బుకు ఆశపడి, 45 రోజుల పసికందును తండ్రి జమ్మికుంటకు చెందిన వ్యక్తికి విక్రయించాడు. ప్రశ్నించినందుకు తన తల్లిదండ్రులను కొట్టాడని జ్యోతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు లక్ష్మణ్‌పై కేసు నమోదు చేయడంతోపాటు పాపను తల్లి వద్దకు చేర్చారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



కథలాపూర్(వేములవాడ): మేడిపెల్లి మండలంలోని కొండాపూర్, విలయాతబాద్ గ్రామాల్లో అనుకోకుండా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. విలయాతబాద్‌కు చెందిన బత్తుల జమున, కొండాపూర్‌కు చెందిన తోపారపు బాలయ్య తమ ఫోన్లను ఇటీవల పోగొట్టుకున్నారని అన్నారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆధునిక టెక్నాలజీతో వాటిని కనిపెట్టినట్లు చెప్పారు. మంగళవారం వారిని పిలిపించి, అప్పగించినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


శంకర్ మృతదేహం

మల్లాపూర్(కోరుట్ల): వాల్గొండకు చెందిన చెట్‌పల్లి శంకర్(34) అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శంకర్‌కు భార్య వాణి, ఇద్దరు పిల్ల లు ఉన్నారు. అతను ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి, అనారోగ్య సమస్యలతో స్వగ్రామం తిరిగి వచ్చాడు. అప్పటినుంచి పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం తమ పాత ఇంటి వద్ద మామిడి చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఠాణాలో పెట్రోల్ పోసుకొని హంగామా

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన ఓ వ్యక్తి మంగళవారం ఠాణాలో పెట్రోల్ పోసుకొని, హంగామా చేశాడు. తన కూతురును కృష్ణానగర్‌కే చెందిన ఓ వ్యక్తి అవమానించాడంటూ మద్యం తాగి, ఫిర్యాదు చేసేందుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకున్నాడు. పోలీసులు అప్రమత్తమై, అతన్ని బయటకు పంపించారు.

రాజీవ్ రహదారి రక్తసిక్తం

• ట్రాక్టర్ ఢీకొని ముగ్గురు యువకుల దుర్మరణం
• మరో వాహనం సైతం ఢీకొన్నట్లు అనుమానం
• మృతులది చిగురుమామిడి మండలం రామంచ
• రాంగ్‌రూట్ కారణంగా ప్రమాదం
• గ్రామంలో విషాదఛాయలు


అంజి (ఫైల్)


సంపత్ (ఫైల్)


అర్వింద్ (ఫైల్)

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులోని రాజీవ్‌రహదారి రక్తసిక్తమైంది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులను రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్, మరో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన పైడిపల్లి అర్వింద్ (23) శివరాత్రి సంపత్ (21), శివరాత్రి అంజనేయులు (25) సోమవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై తిమ్మాపూర్ మండలం రేణికుంట సమీపంలో రాజీవ్ రహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్దకు వచ్చారు. సమీపంలోని దాబాలో భోజనం చేద్దామనుకున్నారు. కానీ.. దాబా మూసివేసి ఉండడంతో తిరిగి రామంచ వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఈక్రమంలో రాంగ్ రూట్‌లో వచ్చిన ట్రాక్టర్, గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న అర్వింద్ అక్కడికక్కడే మృతిచెందగా, అంజి , సంపత్ చికిత్స పొందుతూ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం తెల్లవారుజామున మరణించారు.

ఇసుక ట్రాక్టరేనా?

రేణికుంట సమీపంలోని మానేరువాగు నుంచి రాత్రి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ వాగులో నుంచి రాజీవ్ రహదారిపైకి రాంగ్ రూట్లో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ ఢీకొన్న సమయంలో మరో గుర్తుతెలియని వాహనం కూడా బైక్‌ను ఢీకొన్నట్లు పోలీసు అనుమానిస్తున్నారు. నిర్లక్ష్యంగా రాంగ్ రూట్‌లో నడిపిన ట్రాక్టర్ డ్రైవర్ అజయ్, ఓనర్ మహేశ్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు.

వారం రోజుల్లో దుబాయ్ వెళ్లాల్సి ఉండగా..

ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి అంజి ఇంటికి పెద్దవాడు అతని ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. తల్లిదండ్రులు మల్లయ్య, లక్ష్మి వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేసుకుంటారు. అంజి ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తుండడంతో రెండు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. పెళ్లి కుదరకపోవడంతో ఈనెల 24న తిరిగి దుబాయ్ వెళ్లాలనుకున్నాడు. టిక్కెట్ బుక్ చేసుకున్నాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.


ప్రమాదస్థలంలో మృతుల ద్విచక్ర వాహనం

ఒక్కడే కొడుకు..

ప్రమాదంలో మృతిచెందిన శివరాత్రి సంపత్ ఒక్కడే కొడుకు. తల్లిదండ్రులు మహేందర్, రేణుక వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకుతుండగా, సంపత్ కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులకు తోడుగా ఉంటున్నాడు. చేతికి వచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు కంటతడిపెట్టిస్తున్నాయి.

డ్రైవర్‌గా పనిచేసిన అర్వింద్..

గుడ్డిపెల్లి అర్వింద్‌కు తమ్ముడు చెల్లె ఉన్నారు. అతని తల్లిదండ్రులు రాజు, శైలజ. తండ్రి మహేందర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండగా తల్లి వ్యవసాయ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఎదిగిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలిచివేశాయి.

గ్రామంలో విషాదఛాయలు...

ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృత్యువాత పడడంతో గ్రామస్తులు విషాదంలో మునిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కలిసి తిరిగిన స్నేహితులు చనిపోయారనే వార్త నమ్మలేకపోతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

‘బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే’


విస్తారక్ రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): తెలంగాణలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ స్వల్పకానిక విస్తారక్ ధర్మపురి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ గుంటుక సదాశివ్‌తో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఫాంహౌస్‌కు పరిమితం చేసే సమయం ఆసన్నమైందన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల వాగ్దానాలను విస్మరించి, అన్ని వర్గాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చివరకు పోటీ పరీక్షల పేపర్ల లీకులతో ప్రభుత్వం నిరుద్యోగులు, విద్యార్థుల బంగారు భవిష్యత్తును నాశనం చేస్తోందని మండిడ్డారు. బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని, ప్రజలు 2023లో తమ పార్టీకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర శాఖ నూతన అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు గున్నాల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, కిసాన్‌మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు గడ్డం నవీన్‌రెడ్డి, నాయకులు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, పుప్పాల మహేశ్, సారుగు దేవయ్య, రుద్ర బుచ్చిరాజం తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్ ఇంజిన్ సర్కారుతోనే న్యాయం’


సంబరాలు చేసుకుంటున్న నాయకులు

జగిత్యాలటౌన్: ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా నాయకులు ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి, ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్‌ల నియామకంపై హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జగిత్యాల తహసీల్ చౌరస్తాలో టపాసులు కాల్చి, సంబరాలు జరుపుకున్నారు. నాయకుడు ఏసీఎస్ రాజు మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్ర ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కౌన్సిలర్ గుర్రం రాము, నాయకులు చీటి శేఖర్‌రావు, కిశోర్ సింగ్, లక్ష్మారెడ్డి, నల్ల నారాయణరెడ్డి, బిట్టు, గొగికార్ భరత్, బడే శంకర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చల్లబడిన వాతావరణం


జగిత్యాలలో పడుతున్న చిరుజల్లులు

జగిత్యాల: కొద్దిరోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు మంగళవారం కురిసిన చిరుజల్లులు ఊరట కలిగించాయి. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయి. భారీ వర్షం కురిసేలా ఉందని భావించినా.. చిరుజల్లులే కురిశాయి.వాతావరణ ఒక్కసారిగా చల్లడింది.

నీటిలో ముంచి.. ఊపిరి తీసి

• స్నానం కోసం వరద కాలువలోకి తీసుకెళ్లిన భర్త
• భార్యపై అనుమానంతో హత్య


షబానా బీ (ఫైల్)


భర్త జమీర్

కోరుట్ల: భార్యను అనుమానించి వరదకాలువలో ముంచి చంపాడు ఓ భర్త.. అంతటితో ఆగకుండా నేరం నుంచి తప్పించుకునేందుకు పుట్టింటికి పంపానని అత్తకు ఫోన్‌చేసి చెప్పాడు. జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన ఈ ఘాతుకాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన ఇర్ఫానా బేగం భర్త అజీజ్ కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఇళ్లలో పలు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని సాకుతోంది. ఏడాదిక్రితం తన కుమార్తె షబానాబీ(21)ని కోరుట్లలోని గంగంపేటలో ఉండే జమీర్(28)కు ఇచ్చి వివాహం జరిపింది. కొద్దిరోజుల తర్వాత షబానాను అనుమానిస్తూ వచ్చిన జమీర్.. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో షబానాను జగిత్యాలకు వెళ్లే బస్సు ఎక్కించి పుట్టింటికి పంపానని తన అత్తకు ఫోన్‌చేసి చెప్పాడు. సాయంత్రం వరకూ కూతురు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇర్ఫానాబేగం.. కోరుట్లకు వచ్చింది. కూతురు తన ఇంటికి రాలేదని జమీర్‌ను అడిగింది. అయితే, తాను బస్సు ఎక్కించానని, ఆమె ఎక్కడికి వెళ్లిందో తెలియదని తప్పించుకున్నాడు. దీంతో అదేరోజు రాత్రి కోరుట్ల సీఐ ప్రవీణకుమార్‌కు ఇర్ఫానా ఫిర్యాదు చేసింది. పోలీసులు జమీర్‌ను విచారణ జరపగా.. షబానాను కోరుట్ల బస్టాండ్‌లోనే జగిత్యాలకు వెళ్లే బస్సు ఎక్కించానని చెప్పాడు. ఆ సమయంలో బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించగా ఆ దృశ్యాలేమీ లభించలేదు. దీంతో జమీర్‌ను అనుమానించిన పోలీసులు.. గట్టిగా ప్రశ్నించడంతే.. తానే షబానాను సోమవారం ఉదయం కథలాపూర్ మండలం భూషన్‌రావుపేట శివారులోని వరదకాలువ వద్దకు తీసుకెళ్లానని, స్నానం చేద్దామని లోనికి తీసుకెళ్లి నీటిలో ముంచి చంపానని అంగీకరించాడు. దీంతో మంగళవారం సాయంత్రం సీఐ ప్రవీణ్‌కుమార్, కోరుట్ల, కథలాపూర్ ఎస్సైలు కిరణ్, కిరణ్‌కుమార్ వరద కాలువ వద్దకు వెళ్లి నీటిలో గాలించారు. దీంతో షబానా మృతదేహం లభ్యమైంది. షబానాపై అనుమానంతో భర్త జమీర్ చంపినట్లు సీఐ ప్రవీణకుమార్ తెలిపారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

• రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్


గణాంక సమాచార దర్శిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యేలు, కలెక్టర్

ధర్మపురి : అన్ని వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన వివిధ అభివృద్ధి పనులకు రూ.9.32 కోట్లు మంజూరవగా ధర్మపురిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మపురి నియోజకవర్గంలోని నూతన కుల సంఘ భవనాలకు, అసంపూర్తిగా ఉన్న భవనాలకు, బోర్‌వెల్స్, పంపుసెట్లు, హైమాస్ట్ లైట్లు తదితర 334 పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. వీటితో ఆయా మండలాల్లో నెలకొన్న సమస్యలు తీరుతాయని చెప్పారు. అనంతరం పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. వివేకానంద విగ్రహం నుంచి ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేసారు. డీసీఎమ్మెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, జెడ్పీటీసీ సభ్యులు బత్తిని అరుణ, బాదినేని రాజేందర్, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్, వైస్ చైర్మన్ రామన్న, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

‘జిల్లా గణాంక సమాచార దర్శిని’ ఆవిష్కరణ

జగిత్యాల: జిల్లా గణాంక సమాచార దర్శిని చాలా ఉపయోగపడుతుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సమాచార దర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో జిల్లాలోని వివిధ శాఖల సమాచారం ఉందని, వివిధ పరిశోధన విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, కలెక్టర్ యాస్మిన్ బాషా, ప్రణాళికా అధికారి పూర్ణచందర్‌రావు, గణాంక అధికారి మల్లేశం పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘ భవనానికి స్థలం కేటాయించాలి

ఎల్‌ఐసీ ఏజెంట్ల సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఏజెంట్లు కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. ఎల్‌ఐసీ బ్రాంచిలో వెయ్యి మందికి పైగా పని చేస్తున్నామని, తమకు భవనం ఒక వేదికగా ఉండేలా స్థలం ఇవ్వాలని విన్నవించారు. స్పందించిన మంత్రి స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


విజేతలతో అధికారులు

జగిత్యాలజోన్:విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని ఆర్‌బీఐ తెలంగాణ రాష్ట్ర లైజనింగ్ అధికారి శ్రీకుమార్ సూచించారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ఆదాయం, పొదుపు, ఆర్థిక క్రమశిక్షణపై అవగాహన ఉంటే జీవితం సంతోషంగా సాగుతుందని తెలిపారు. ఎఈవో గాయత్రి, జిల్లా ఆర్థిక అక్షరాస్యత కౌన్సెలర్ కోట మధుసూదన్, సెక్టోరియల్ అధికారులు దేవేందర్, అంజయ్య పాల్గొన్నారు.

విజేతల వివరాలు

ప్రథమ : ఎస్.అన్విత, ఎస్.అమూల్య(కోరుట్ల మండలం మోహన్‌రావుపేట)

ద్వితీయ : ఒ.నితిన్, ఆర్.సామిత్(ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ), ఎ.వేదశ్రీ, డి.సాయిదీప్(కోరుట్ల మండలం మోహన్‌రావుపేట).

బతకాలని లేదని.. గడ్డి మందు తాగాడు

• చికిత్స పొందుతూ తుంగూర్ యువకుడి మృతి


కరుణాకర్ (ఫైల్)

సారంగాపూర్(జగిత్యాల): భార్యతో తనకు బతకాలని లేదన్నాడు.. ఆమె బయటకు వెళ్లిన కాసేపటికే గడ్డి మందు తాగగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన కటికరెడ్డి కరుణాకర్(27)కు భార్య గౌతమి, 10 నెలల పాప ఉన్నారు. అతను వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఉన్నట్టుండి సోమవారం సాయంత్రం తనకు బతకాలని లేదని భార్యతో అన్నాడు. ఆమె బయటకు వెళ్లిన సమయంలో గడ్డి మందు తాగాడు. కాసేపటికి గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతన్ని జగిత్యాలకు, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా ఇంకా తమకు ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం


వృద్ధుడి మృతదేహం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని 11వ వార్డు శివారులో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైందని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. తెల్లని ధోవతి, షర్టు ధరించాడని, సుమారు 70 ఏళ్ల వయసు ఉంటుందన్నారు. పలువురి సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మంత్రి కొప్పుల వ్యాఖ్యలు అర్థరహితం

• కాంగ్రెస్‌లోనే దళితులకు సముచిత స్థానం
• డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


బుగ్గారంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం(ధర్మపురి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం బుగ్గారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగర్జన సభ సందర్భంగా సీఎల్పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్కను రేవంత్‌రెడ్డి అవమానించారన్న ఆరోపణను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దళితులకు కాంగ్రెస్‌లోనే సముచిత, గౌరవం లభించాయని తెలిపారు. ప్రస్తుతం తమ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఒక దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడే అన్నారు. బీఆర్‌ఎస్‌లోనే దళిత నాయకులకు పలుమార్లు అవమానం జరిగిందని విమర్శించారు. మంత్రి ఈశ్వర్‌నే సీఎం కేసీఆర్ చేయిపట్టి లాగేయడం రాష్ట్ర ప్రజలందరూ చూశారని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ దళిత సమాజాన్ని మోసం చేసిందన్నారు. దళితునికి ముఖ్యమంత్రి పదవి, పేద దళితులకు మూడెకరాల భూమి వంటి ఎన్నో హామీలను గాలికొదిలేశారని మండిపడ్డారు. ఇకనైనా మంత్రి వాస్తవాలు తెలుసుకొని, మాట్లాడాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంగనభట్ల దినేశ్, పెద్దనవేణి శంకర్, నగునూరి నర్సాగౌడ్, తిరుపతి, అంజిత్, శంకరయ్య, వెంకన్న, పెద్ద రామన్న, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్త ఫించన్.. కోడలి వంచన

• మూడేళ్లుగా డబ్బులు కాజేస్తున్న కోడలు
• మున్సిపల్ ఎదుట సొమ్మసిల్లిన అవ్వ
• తలకు తీవ్ర గాయాలు


వృద్ధురాలిని ఓదార్చుతున్న జిందం చక్రపాణి

సిరిసిల్లటౌన్: కట్టుకున్నోడు ఏళ్ల కింద కాలం చేశాడు. పెళ్లి వయస్సు రాకముందు పెద్దకొడుకు.. పెళ్లయినంక చిన్నకొడుకు అనారోగ్యంతో చనిపోయారు. అప్పట్నుంచి చిన్న కోడలే ప్రపంచమని బతుకుతున్న ఓ అత్తను కోడలు బురిడీ కొట్టిస్తుంది. అత్త ఆస్తితో పాటు వృద్ధాప్య ఫించన్‌ను మూడేళ్లుగా కాజేస్తున్న ఘటన ఇది. బాధితురాలి వివరాల మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గాంధీనగర్‌కు చెందిన పత్తిపాక అనసూయమ్మకు ఇద్దరు కొడుకులు. భర్త 40 ఏళ్ల క్రితం చనిపోగా, ఇద్దరు కొడుకులను పెంచి ప్రయోజకులను చేసింది. పెద్ద కొడుకు పెళ్లికాకముందే చనిపోగా, చిన్నకొడుక్కు పెళ్లి చేసింది. వారే లోకంగా అనసూయమ్మ బతుకుతుండగా పదేళ్ల క్రితం చిన్నకొడుకు చనిపోయాడు. ఇదే అదనుగా చిన్నకోడలు భాగ్య అత్తపేరున ఉన్న ఆస్తిని రాయించుకుని పెన్షన్ వచ్చే అకౌంట్ ఏటీఎం కార్డును తన వద్ద ఉంచుకుంది. నెలనెలా వచ్చే పింఛన్ డబ్బులను మూడేళ్లుగా డ్రా చేస్తుంది. పింఛన్ తెచ్చుకోవాలని అనసూయమ్మ అడిగితే రావడం లేదని చెబుతూ వచ్చింది. ఈక్రమంలో మందులకు డబ్బులు లేకపోవడంతో పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదంటూ ఆ వృద్ధురాలు బోరున విలపిస్తూ సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి వచ్చి అక్కడే గేట్ ఎదుట సొమ్మసిల్లి పడిపోగా, తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి వృద్ధురాలి బాధను విన్నారు. అధికారులను వాకబు చేయగా, నెలనెలా అనసూయమ్మ అకౌంట్‌లో పెన్షన్ జమవుతుందని చెప్పడంతో కోడలు బండారం బయటపడింది. తలకు దెబ్బతాకడంతో వెంటనే అనసూయమ్మను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. టౌన్ సీఐ అనిల్‌కుమార్ కోడలుకు కౌన్సెలింగ్ ఇచ్చి, ఇద్దరినీ ఇంటికి పంపించారు. కాగా ఆ అవ్వ బాధను విన్న స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఎమ్మెల్సీ రమణ తండ్రి పార్థివదేహానికి నివాళి







ఎల్‌జీ రామ్ పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పరామర్శిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎమ్మెల్యే రవిశంకర్

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి ఎల్‌జీ రామ్ పార్థివదేహానికి రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల, చొప్పదండి ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, సుంకె రవిశంకర్, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ ఎగ్గిడి భాస్కర్, డీఎస్పీ ప్రకాశ్, అన్ని పార్టీల జిల్లా నాయకులు మంగళవారం నివాళి అర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు జగిత్యాల మోతె రోడ్‌లోని శంకర్‌ఘాట్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.